సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 2 । నవంబర్ । 2024



దాడులు.. దౌర్జన్యాలు

జిల్లాలో రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు.

- 8లో



రహదారులు రక్తసిక్తం

జిల్లాలో రహదారులు రక్తసిక్తమయ్యాయి. దాదాపు 18 మంది గాయపడ్డారు.

- 8లో



చోరీకి యత్నం

కొరసవాడ సచివాలయంలో చోరీకి ప్రయత్నించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

అమరజీవికి అవమానం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అమరజీవి పొట్టి శ్రీరాములును అధికారులు, అధికార పార్టీ నేతలు విస్మరించారు. నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రతి ఏటా జరుపుకునే ఆనవాయితీ ఉంది. శ్రీకాకుళం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి పది అడుగుల దూరంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎవరూ కనీసం ఓ పూలదండనైనా వేయలేకపోయారు. కలెక్టర్‌తో పాటు మిగిలిన జిల్లా అధికారులు, కార్పొరేషన్ అధికారులు, కూటమి నేతలంతా అమరజీవిని మరిచిపోయారు. ఆర్యవైశ్య కులానికి చెందిన వారు మాత్రమే దండలు వేసి గౌరవించారు.

సనపల సురేష్ కుమార్ హౌస్ అరెస్టు

బూర్జ: మండలంలో గల గుత్తావల్లి గ్రామానికి చెందిన స్వతంత్ర్య అభ్యర్థి సనపల సురేష్ కుమార్‌ను హౌస్ అరెస్టు చేసినట్లు ఆయన ఒక వీడియో రిలీజ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించిన సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీసులు హౌస్ అరెస్టు చేసినట్లు ఆయన తెలియజేశారు. వైద్యం కోసం విశాఖపట్నం వెళ్తున్నా స్థానిక పోలీసులు తన ఇంటికి వచ్చి హౌస్ అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

పాతపట్నంలో భారీ వర్షం



పాతపట్నంలో కురిసిన భారీ వర్షం

పాతపట్నం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఏకధాటిగా కురిసిన వానకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, రొంపివలస, గంగువాడ, ఆర్.ఎల్.పురం, తెంబూరు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

అవినీతి రహిత సమాజమే ధ్యేయం



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

శ్రీకాకుళం క్రైమ్ : అవినీతి రహిత సమాజానికి తమ వంతు కృషి చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావు అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా.. శుక్రవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ జనరల్ హరీష్ గుప్తా ఆదేశాల మేరకు రామలక్ష్మణ సమీపంలోని కార్యాలయం నందు అధికారులు, సిబ్బందితో విజిలెన్స్ ఎస్పీ ప్రతిజ్ఞ నిర్వహించారు.

చంద్రబాబు పర్యటనతో ఒరిగిందేమీ లేదు



టెక్కలి: చంద్రబాబు పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమి లేదని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ సిక్స్ హామీల నుంచి తప్పించుకోవడానికే పర్యటనల పేరుతో హడావుడి చేస్తున్నారు తప్ప ప్రజల కోసం కాదన్నారు. చంద్రబాబు పాలనలో ఏనాడైనా జిల్లా అభివృద్ధి కోసం పట్టించుకున్నారా అని తిలక్ ప్రశ్నించారు. గతంలో టీడీపీ జిల్లాలో పోర్టు కడతామని చెబుతూ కాలయాపన చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఎంతో చిత్తశుద్ధిగా వ్యవహరించి జిల్లాకు పోర్టు తీసుకువచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు జిల్లా పర్యటనలో సాగునీటి ప్రాజెక్టుల కోసం కనీసం ప్రస్తావన చేయకపోవడం శోచనీయమన్నారు. కేవలం నెలల వ్యవధి పాలనలోనే కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలు గమనించారని.. ఎప్పుడు ఎన్నికలొస్తాయా.. కూటమి ప్రభుత్వాన్ని కూలదోస్తామా..అని ఎదురు చూస్తున్నారని తిలక్ పేర్కొన్నారు.

అమావాస్య వేళ.. కోటి ఒత్తుల వెన్నెల





శ్రీకాకుళం బలగ సమీపంలోని బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో దీపాల పండుగను వేడుకగా నిర్వహించారు. 11 అడుగుల ఎత్తు ఉన్న నరకాసురుని బొమ్మను తయారు చేసి భక్తులంతా కలసి దహనం చేశారు. అనంతరం కోటి వత్తులను ఒక్కటిగా చేసి వెలిగించారు. - శ్రీకాకుళం కల్చరల్

నవ్వులే.. పండగ దివ్వెలై



దేశవానిపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు దీపావళి పండుగను సందడిగా నిర్వహించారు. మేట్రిన్ పద్మావతి బాణసంచా సామగ్రి తెప్పించగా విద్యార్థులు ఆనందంగా గడిపారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. - నరసన్నపేట

నాడు ఆనందమనిపించన్..



శ్రీకాకుళం నగరంలోని 12వ వార్డులో లబ్ధిదారు అప్పలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి (ఫైల్)



శ్రీకాకుళం నగరంలోని గార వీధిలో బమ్మిడి కామమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన్ (ఫైల్)

ఉదయాన్నే ఇంటి గడప దాటే అవసరం లేకుండా పింఛన్ పంపిణీ చేసిన స్వర్ణయుగమది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ల సాయంతో పింఛన్ల పంపిణీని ఇంటికే అందించే చారిత్రక ఘట్టానికి పురుడు పోసింది. అంతకు ముందు నాయకులెవరూ ఆ ఆలోచన కూడా చేయలేదు. ఐదేళ్ల పాటు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఠంచనుగా పింఛను అందించేవారు. వృద్ధులు, దివ్యాంగులకు ఏ మాత్రం కష్టం రానీయకుండా ఇలా పింఛన్ డబ్బు చేతికి అందించేవారు. శుక్రవారం పింఛన్ డబ్బు అందుకోవడానికి ఇబ్బంది పడిన వృద్ధులు ఈ కాలాన్ని గుర్తు చేసుకున్నారు.

నేడు ఏడిపించన్..



బాబు.. తేడా చూడు



జి.సిగడాం: స్థానిక సచివాలయం వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు వీరు. ఉదయం ఏడు గంటల నుంచి భోజనాలు కూడా చేయకుండా నిరీక్షించారు. అంతసేపు నిలబడలేక, కూర్చోలేక అక్కడే అవస్థలు పడ్డారు.

పింఛన్ల పంపిణీ తొలిరోజు లబ్ధిదారులను ఏడిపించింది. ఉదయం ప్రారంభమైన పంపిణీ కాసేపటికే సర్వర్ సమస్యతో ఆగిపోయింది. దీంతో లబ్ధిదారులకు పింఛన్ అందుతుందో లేదోనన్న గుబులు మొదలైంది. అందరూ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలకు వెళ్లి దీనంగా నిరీక్షించాల్సి వచ్చింది. ఒకటి రెండు చోట్ల వృద్ధులు కనీసం భోజనాలు కూడా చేయకుండా మధ్యాహ్నం వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. నువ్వలరేవులో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయారు. గత ఐదేళ్ల కాలంలో పింఛన్ల కోసం ఎన్నడూ ఇన్ని అగచాట్లు పడలేదని లబ్ధిదారులు గుర్తు చేసుకున్నారు.

పింఛన్ ఇంటి వద్దే గౌరవంగా ఇవ్వాలి. అలా కాదని ఒకచోట గానీ, సచివాలయాల వద్ద గానీ పంపిణీ చేస్తే వారిపై చర్యలు తప్పవు.

- ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

శుక్రవారం జిల్లాలో జరిగిన పింఛన్ల పంపిణీ సీఎం వ్యాఖ్య శుద్ధ అబద్ధమని తేల్చిపారేసింది. జిల్లాలో ఉదయానికే పింఛన్ల పంపిణీ సాంకేతిక సమస్యల వల్ల ఆగిపోయింది. దీంతో లబ్ధిదారులంతా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వచ్చింది.



పేటలో ఉదయం 8 గంటల వరకు సజావుగా జరిగిన పింఛన్ల పంపిణీ ఆ తర్వాత ఆగిపోయింది. దీంతో ఏమైందోనని వృద్ధులంతా పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఇలా గంటల కొద్దీ నిరీక్షించారు. - నరసన్నపేట

వైకల్యం కనిపించదా..?



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సీపాన ఆనందరావు. ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామానికి చెందిన ఆనందరావు అంధుడు. 2019 నుంచి ఆయన పింఛన్ అందుకుంటున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక టీడీపీ నాయకులు ఆనందరావు దివ్యాంగుడు కాదంటూ అతని పింఛన్ నిలుపుదల చేశారు. రిమ్స్ నుంచి సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నా కనికరించలేదు. ఎంపీడీఓను కలిసినా ఫలితం లేకపోయింది. మూడు నెలలు పింఛన్ ఆపేస్తే తన పింఛన్ రద్దయిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నారు.



శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రినుంచి ఇటీవల 100 శాతం బ్లైండ్ అని వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్

- ఆమదాలవలస

పింఛన్ ఎవరు ఆపినా నిలదీయాలి. అది మీ హక్కు.

- ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య ఇది..

కానీ ఆనందరావు విషయంలో సీఎం వ్యాఖ్య అర్థం లేనిదిగా మారిపోయింది. టీడీపీ నాయకులే కక్ష కట్టుకుని ఓ దివ్యాంగుడి పింఛన్‌ను ఆపేశారు. ఆస్పత్రులకు వెళ్లి సదరం సర్టిఫికెట్లు తెచ్చుకున్నా, స్థానిక టీడీపీ నాయకులకు బతిమలాడినా కరుణించలేదు.



టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు వీరంతా. సర్వర్ సాంకేతిక లోపంతో మధ్యాహ్నం 12 గంటల వరకు వీరు ఇలాగే దీనంగా నిరీక్షించాల్సి వచ్చింది.

-టెక్కలి

ఇబ్బందులు వస్తున్నాయి



గత ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ఇబ్బందులు వస్తున్నాయి. వేలిముద్రలు పడడం లేదన్నారు. ముఖానికి ఫొటో తీశారు. అదీ కాలేదు. సర్వర్ బాగోలేదన్నారు. పింఛన్ అందదేమో అని కార్యాలయానికి వచ్చాం. మధ్యాహ్నం తర్వాత పింఛన్ ఇచ్చారు. - కానూరు అప్పారావు, దేశవానిపేట

అడవుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడదాం

వజ్రపుకొత్తూరు రూరల్: శ్రీకాకుళోద్యమ తొలి అమరులు కామ్రేడ్ కోరన్న, మంగన్న స్ఫూర్తితో నేడు బీజేపీ అవలంబిస్తున్న అడవుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేష్ పిలుపునిచ్చారు. మండలంలోని గరుడభద్ర పంచాయతీ పరిధిలో గల మర్రిపాడులో శ్రీకాకుళ అమరుల స్థూపం వద్ద శుక్రవారం కామ్రేడ్ కోరన్న, మంగన్నల 57 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ ప్రభుత్వం అటవీ పరిరక్షణ చట్టాలను తుంగలోకి తొక్కి పచ్చని అడవులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని వక్తలు విమర్శించారు. ఆదివాసులను, అటవీ సంపదను కాపాడేందుకు పోరాటం చేయాలని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘ నాయకులు వంకల పాపయ్య, కుత్తం వినోద్, మామిడి భీమారావు, జుత్తు వీరస్వామీ, మద్దిల రామారావు, సాలిన వీరస్వామి, బి.ఈశ్వరమ్మ, పి.తాతారావు తదితరులు ఉన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘ నాయకులు

డిసెంబర్ 14న లోక్ అదాలత్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులు డిసెంబర్ 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టులోని న్యాయ సదన్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించాలని తెలిపారు. ఈ సారి జిల్లాలోని ప్రతి మండలంలో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తామన్నారు. కక్షిదారులు అందరూ వారి కేసులు ఆయా పరిధిలో జరిగే కార్యక్రమాల్లో రాజీ చేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు సమన్వయంతో ఎక్కువ కేసులు రాజీ చేయాలని ఆయన తెలిపారు.

బాబు నోట.. పాత పాట

- చంద్రబాబు హామీలపై పుర వాసులు పెదవి విరుపు
- బాబు ప్రసంగిస్తున్న సమయంలో వెనుదిరిగిన ప్రజలు

ఇచ్ఛాపురం రూరల్: చంద్రబాబు పాత పాట విని ఇచ్ఛాపురం వాసుల్లో అసహనం పెరిగింది. ఉచిత గ్యాస్ పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి శుక్రవారం ఇచ్ఛాపురం మండలంలోని ఈదుపురం గ్రామానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా తనకు అలవాటైన రీతిలో పాత హామీలనే కొత్తగా గుప్పించారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పార్కు ఏర్పాటు చేయాలని, ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి 11 ఓపెన్ హెడ్ చానెల్స్‌ను ఏర్పాటు చేయాలని, బెంతు ఒరియాలకు కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కొబ్బరి పార్కును నెలకొల్పుతానని, రూ.30 కోట్లతో గ్రోయిన్స్, లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇదే హామీని అటు చంద్రబాబు, ఇటు ఎంపీ, మంత్రులు పలుమార్లు సమావేశాల్లో చెప్పినప్పటికీ ఇంత వరకు ఎన్నడూ పనుల జోలికి వెళ్లలేదని రైతులు నవ్వుకున్నారు. తమ ప్రభుత్వం వస్తే బెంతు ఒరియాలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తానంటూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో బెంతు ఒరియా సంఘ నాయకులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే అశోక్ ఈ మాటను సీఎం ద్వారా చెప్పిస్తానంటూ ఆశ చూపించడంతో పదుల సంఖ్యలో బెంతు ఒరియా సంఘ నాయకులు వేదిక వద్దకు చేరుకున్నారు. అయితే ఈ విషయమై చంద్రబాబు స్పష్టమైన హామీ ఇవ్వకపోగా, ఈ సమస్య ఎప్పటి నుంచో ఉందని, ఏ విధంగా వారికి న్యాయం చేయాలో చేస్తామని, ఇమిడియట్‌గా నివాస ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామంటూ బెంతు ఒరియాల ఆశలపై నీళ్లు చల్లారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మందుబాబులకు తక్కువ ధరలకే నాణ్యమైన మందు అందిస్తున్నామంటూ చంద్రబాబు అనడంతో వేదిక దిగువనున్న కొంత మంది తెలుగు తమ్ముళ్లు ముసిముసిగా నవ్వుకుంటూ పాత ధరలకే మద్యం అమ్ముతున్నారని ఒకరిపై ఒకరు సెటైర్ వేసుకున్నారు. చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంట్, బెల్టు షాపులు, పొట్టి శ్రీరాములు గురించి సుదీర్ఘంగా ప్రసంగం చేసిన సమయంలో వేదిక ముందు నాలుగైదు వరుసలు తప్ప మిగతా వారంతా వెనుదిరిగారు. మధ్యాహ్న సమయంలో సీఎం చంద్రబాబు వస్తుండగా, ఉదయం 9 గంటల నుంచే తెలుగు తమ్ముళ్లు ప్రజల్ని సభా వేదిక వద్దకు రప్పించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇంకా వేదిక వద్దకు రాకుండానే చాలా మంది ఆకలితో వెనుదిరిగారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఈదుపురం అష్ట దిగ్బంధం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామాన్ని సీఎం చంద్రబాబునాయుడు రాక సందర్భంగా అష్ట దిగ్బంధనం చేశారు. పోలీసులు ఈదుపురం గ్రామాన్ని తమ చేతుల్లోకి తీసుకొని ప్రధాన రహదారులు తిప్పనపుట్టుగ జంక్షన్, కొఠారీ జంక్షన్, హెలీప్యాడ్, బెల్లుపడ-ఈదుపురం జంక్షన్‌లో బారికేడ్లు పెట్టారు. దీంతో ఈదుపురం, కేశుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు, లక్ష్మీపురం, కొఠారీ, ఈదుపురం, తిప్పనపుట్టుగ గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయం ఉద్యోగులు ఇచ్ఛాపురం నుంచి విధుల్లోకి వెళ్లేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, వ్యాపారులు కూడా రాకపోకలకు అవస్థలు పడ్డారు.

పంటపొలమిలా.. పాలకంకిలా..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో వరి పైరు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎల్.ఎన్.పేట మండలం వాతావరణం అనుకూలించడంతో పలు గ్రామాల్లో పంట పాలకంకి దశకు చేరుకుని కళకళలాడుతోంది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించి ఆదుకోకపోయినప్పటికీ వరుణుడు కరుణించడంతో పంట పండిందని రైతులు చెబుతున్నారు. - ఎల్.ఎన్.పేట

ఆంక్షల నడుమ సమీక్ష

అరసవల్లి: అడుగడుగునా ఆంక్షల నడుమ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం రాత్రి జిల్లా పరిషత్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కానీ జిల్లా పరిషత్ అవుట్ గేట్ వద్ద నుంచే ఆంక్షలు విధించారు. గత ప్రభుత్వంతో పరిచయాలు ఉండకూడదని, అధికారులంతా తనలో 1995 నాటి చంద్రబాబును చూస్తారంటూ చెప్పుకొచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. వంశధారతో పాటు ఇతర సాగునీటి వనరులపై సమీక్షించారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని ఆదేశించినట్లుగా సమాచారం. దేవాలయాలను అభివృద్ధి చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిసింది. సమీక్ష సమావేశం సాగదీతపై అధికారులంతా అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. సమీక్షలో కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ వైద్యాధికారిగా అనూష



అవార్డు అందుకుంటున్న గజవిల్లి అనూష

టెక్కలి: కర్ణాటకలో వైద్యాధికారిగా పనిచేస్తున్న టెక్కలికి చెందిన గజవిల్లి అనూష ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్నారు. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు అనూష కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈమెకు అవార్డు లభించడం పట్ల సొండి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయం కూల్చివేత అవాస్తవం



మాట్లాడుతున్న సీహెచ్ రాజాం గ్రామస్తులు

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజాం పంచాయతీ బొడ్డపాడులో పురాతన శివాలయాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం కూల్చివేశారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్ సీహెచ్ శ్రీనివాస రెడ్డి, గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ శివాలయం చాలా పురాతనమైనదని, ఇటీవల కురిసిన వర్షాలకు సగం పడిపోయిందని, మిగతా కోవెల కూడా ప్రమాదకరంగా మారడంతో రానున్న కార్తీకమాసం దృష్ట్యా పురోహితుల సూచనల మేరకే తొలగించామని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. త్వరలోనే ఆలయం సరికొత్తగా నిర్మిస్తామని తెలిపారు. ఇద్దరు పురోహితుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా గుప్త నిధుల కోసం కూల్చివేశారంటూ వదంతులు సృష్టించారని చెప్పారు.

పాతపాడులో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట పంచాయతీ పాతపాడులో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో నివగాన ముఖలింగంకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. దుస్తులు, సామగ్రి, ధాన్యం కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

గుర్రాలపాలెంలో..

ఎచ్చెర్ల: లావేరు మండలం గుర్రాలపాలెం ఎస్సీ కాలనీలో నేతల పెంటయ్యకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామగ్రి ఎల్ఈడీ టీవీ రూ.25 వేలు నగదు, బంగారం, కుమారుడి ఒరిజనల్స్ సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయి.

సచివాలయంలో చోరీకి యత్నం



బీరువా లాకర్‌ను పరిశీలిస్తున్న ఏఎస్ఐ సింహాచలం

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా లాకర్లు తెరిచారు. గ్రామ శివారున కార్యాలయం ఉండటం, దీపావళి కావడంతో తాళాన్ని యాక్సా బ్లేడ్‌తో కట్ చేసి లోపలికి వెళ్లి సర్వేయర్ అసిస్టెంట్‌కు చెందిన బీరువా లాకర్ తొలగించారు. శుక్రవారం ఉదయం పంచాయతీ సెక్రటరీ కృష్ణంరాజు, సచివాలయ ఉద్యోగులు రాగా.. కార్యాలయం తెరిచి ఉండడాన్ని గుర్తించి సర్పంచ్ ఉమాకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ జి.సింహచలం ఘటనా స్థలానికి చేరుకుని బీరువా లాకర్లను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఒకటో తేదీ పెన్షన్ డబ్బులు బీరువా లాకర్‌లో ఉంటాయని భావించి చోరీకి ప్రయత్నించి ఉంటారని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నరసన్నపేట: స్థానిక శివనగర్‌కాలనీలో బగ్గు సూర్యనారాయణ (45) అనే వ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. బుధవారం కూలి పనికి వెళ్లి ఇంటి సమీపంలో ఉన్న చెరువులో స్నానం చేసేందుకు దిగగా ప్రమాదవశాత్తూ కూరుకుపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం చేయించారు. భార్య నరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ దాలినాయుడు తెలిపారు.

దాడులు.. దౌర్జన్యాలు!



- జిల్లాలో రెచ్చిపోతున్న రౌడీమూకలు
- కొనసాగుతున్న ప్రతీకార రాజకీయాలు
- మహిళలపై ఆగని అఘాయిత్యాలు



గంజాయి బస్తాలు(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్: కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో రాజకీయ దౌర్జన్యాలు, దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ఇక చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు నిత్యకృత్యంగా మారాయి. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుండటంతో నేరాలను అదుపులోకి తెచ్చేందుకు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సారథ్యంలోని జిల్లా పోలీసు శాఖ ప్రయత్నాలు సాగిస్తున్నప్పటికీ.. ఓ వైపు బందోబస్తులు.. మరోవైపు పేరుకుపోతున్న పెండెన్సీ కేసులతో సిబ్బంది సతమతమవుతున్నారు.

ప్రతీకార పోరు..

- కోటబొమ్మాళి మండలం నిమ్మాడ పంచాయతీ చిన వెంకటాపురంలో అమ్మవారి దేవాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఏజెంట్ తోట మాధవరావు తండ్రి మల్లేషును టీడీపీ వర్గీయులు దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ చనిపోయాడు.
- ఆగస్టు 18న ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కూన ప్రసాద్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో చికిత్స పొందుతూ అదే నెల 24న మరణించాడు. గ్రామంలో ఇప్పటికీ పోలీస్ పికెట్ కొనసాగుతోంది.
- జూన్ 30న ఇచ్ఛాపురం స్వర్ణపురం బీచ్ (ఏవోబీ ప్రాంతం)లో ఇరువర్గాల మధ్య ఘర్షణలో ఆసిబాలు అనే యువకుడి ఛాతీపై బలమైన ఆయుధంతో గాయపర్చి హత్య చేశారు.
- ఇటీవల నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం వనవిష్ణుపురంలో అమ్మవారి పత్రి కొమ్మల విషయంలో ఇరువర్గాలు పరస్పరదాడులు చేసుకోవడంతో టీడీపీ వ్యక్తి మృతిచెందాడు.

ఫ్యాక్షన్‌ను తలపించేలా దాడులు..

- ఈనెల 16న జిల్లా నడిబొడ్డున బలగ మెట్టు వద్ద సనపల సురేష్ అనే వ్యక్తిపై వందలమంది చూస్తుండగా కారును జీపు, బైకులతో ఫ్యాక్షన్ తరహాలో కొంతమంది వెంబడించారు. పిడిగుద్దులతో దాడి చేసి హత్యాయత్నానికి యత్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశం సంచలనం సృష్టించినా దాడిచేసినవారిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. బాధితున్నే పాత, కొత్త కేసుల్లో అరెస్టు చేశారు. కోర్టు సైతం బాధితునివైపు న్యాయం ఉందని నమ్మి రిమాండ్‌కు నిరాకరించింది.
- ఈ నెల 27న తనపై టీడీపీ నాయకుడు కత్తితో దాడిచేశారని ఫిర్యాదు చేయడానికి పాత్రికేయుడు, వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు అల్లు రమణ తన స్నేహితుడు మొదలవలస మన్మధరావుతో కలిసి వచ్చాడు. ఫిర్యాదు ఇస్తున్నాడన్న కారణంగా టీడీపీ వర్గీయులు మూకుమ్మడిగా స్టేషన్ లోపలికి చొరబడి పోలీసులు అడ్డగిస్తున్నా రమణ, మన్మధరావులపై దాడికి ఎగబడ్డారు.
- పలాస నియోజకవర్గం లక్ష్మీపురం ఎంపీటీసీ (వైఎస్సార్ సీపీ)పై పొలం వద్ద దాడికి పాల్పడ్డారు. అతని భార్య, మేనల్లుడిని సైతం వదల్లేదు.
- జిల్లాకేంద్రంలో రౌడీ షీటర్లు ఇటీవల కాలంలో రెచ్చిపోతున్నారు. 80 ఫీట్ రోడ్‌లోని ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై, బలగలోని పెట్రోల్ బంక్ సిబ్బందిపై, ఎస్‌వీసీ థియేటర్‌లో ఓ ప్రముఖ హీరో అర్ధరాత్రి బెనిఫిట్ షో సందర్భంగా, ఎస్‌వీడీ హోటల్, కె.ఎఫ్.సీలోనూ రౌడీమూకలు రెచ్చిపోయారు. దమ్మలవీధిలో ఓ యువకున్ని గొంతు కోయగా.. కొద్దిరోజుల క్రితం రిమ్స్ రోడ్డులో మిట్టమధ్యాహ్నం కత్తితో ఓ యువకున్ని మరో యువకుడు వెంబడించి మూడు నాలుగు వేటులు వేశాడు. ప్రజల్లో ఇటువంటి ఘటనలు తీవ్ర భయాందోళనకు నెడుతున్నాయి.
- జిల్లాలో ఉన్న ఐదొందల మందికి పైగా రౌడీషీటర్లకు ఎస్పీ స్థాయి అధికారి కౌన్సిలింగ్ ఇస్తే బాగుంటుందని ప్రజల భావన.
- కోటబొమ్మాళి మండలం శ్రీజగన్నాథపురం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై టీడీపీ వర్గీయులు కక్ష కట్టడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆగని లైంగిక వేధింపులు..

- ఎచ్చెర్ల నవభారత్ జంక్షన్‌లో మహిళపై ఆరుగురు మహిళలు అమానవీయంగా దాడి చేశారు.
- ఇటీవల ఓ పోలీస్ అధికారి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ మహిళా కానిస్టేబుల్ జిల్లా ఉన్నతాధికారికే ఫోన్‌లో (ఓరల్) ఫిర్యాదు చేయడం గమనార్హం.
- కాశీబుగ్గ కేంద్రంగా ఇద్దరు బాలికలపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా మరో యువకుడు వీడియోలు తీయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

ఏదీ అడ్డుకట్ట..?

ఇటీవల గంజాయికి సంబంధించి పోలీసులు విస్తృత దాడులు జరుపుతున్నా అక్రమ రవాణాలో గానీ, క్రయ విక్రయాలు, వాడకందారులను అడ్డుకట్టవేయలేకపోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికే 65 మందికి పైగా పరారీలో ఉండటం విశేషం. గంజాయిని నియంత్రించడానికి రాష్ట్ర స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఉందని, ప్రత్యేక పోలీసు బృందాలని, మొబైల్ పెట్రోలింగ్, చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా అంటున్నా దీని మూలాలన్నీ ఒడిశా రాష్ట్రంలోనే ఉన్నాయని తెలిసినా.. పంట సాగు అక్కడిది.. వ్యాపారం సాగించేది అక్కడివారన్న విషయాన్ని వదిలేస్తున్నారు. అక్కడి అధికారులతో కలిసి వారిని ఏమీ చేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి.

పోర్టు ప్రైవేటుపరం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదు



విలేకర్లతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్

సంతబొమ్మాళి: మూలపేట పోర్టు నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 70 శాతం పూర్తి చేసిందని, దీన్ని ఇప్పుడు ప్రైవేటు పరం చేయాలని చూస్తే ప్రజా ఉద్యమం తప్పదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలం సీతానగరంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పోర్టును ప్రైవేటు ఏజెన్సీ అప్పగిస్తే భావి తరాలు నష్టపోతాయని అన్నారు. పోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని నెలలపాటు నిలుపుదల చేసి ఇప్పుడు కమిషన్ల, కాంట్రాక్టర్ కోసమే పునఃప్రారంభించిందని విమర్శించారు. జీఎంఆర్ వంటి బ్రహ్మండమైన ఏజెన్సీతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అనుకున్న సమయానికి ముందే నిర్మాణం పూర్తిచేసి జాతికి అంకితం ఇవ్వాలని చూస్తుంటే రివ్యూలు, సందర్శనలు అని చెప్పి పనులు ముందుకు సాగకుండా బ్లాక్ మెయిలింగ్ చేస్తున్నారని అన్నారు. ఎక్కడ ఏం దొరుకుతుందోననే ఆశతో బాబాయ్ అచ్చెన్నాయుడు, అబ్బాయి రామ్మోహన్‌నాయుడు పోర్టు, ఎయిర్‌పోర్టుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. అమరావతి కోసం పనిచేయడం వల్లే బాబాయ్, అబ్బాయ్‌లకు పదవులు దక్కాయని అన్నారు. చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలకు పెట్టింది పేరని, సూపర్‌సిక్స్ హామీలు నెరవేర్చకుండా వైఎస్ జగన్‌పై బురద జల్లుతూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. మీడియా వర్గాలు కూడా చంద్రబాబు కోసం పనిచేస్తున్నాయని అన్నారు. పాతికేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ గానీ, 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న కింజరాపు కుటుంబీకులు గానీ జిల్లాకు ఒక్క మంచి పని అయినా చేశారా అని సూటిగా ప్రశ్నించారు. అంబేడ్కర్ వర్సిటీ, రిమ్స్, ఆఫ్‌షోర్, పోర్టు, కిడ్నీ ఆస్పత్రి వంటివన్నీ వైఎస్సార్, వైఎస్ జగన్‌ల ఆధ్వర్యంలోనే జరిగాయని గుర్తు చేశారు.

కార్తీకానికి సంగమేశ్వరుడు సిద్ధం



సంగమేశ్వర స్వామి ఆలయం

ఆమదాలవలస : ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర కొండపై ఉన్న సంగమేశ్వర ఆలయం కార్తీక పూజలకు సిద్ధమవుతోంది. హిందూ, జైన, బౌద్ధ మతాలకు చెందిన విగ్రహాలు ఇక్కడ ఉండటం ఆ క్షేత్ర విశేషం . ఈ కొండను సంగమయ్య కొండ అని, గోపకొండ అని కూడా పిలుస్తారు. ఈ కొండ చరిత్ర 12వ శతాబ్దం నాటిదని 1982లో సర్వే చేసిన పురావస్తు శాఖ ప్రతినిధి జవహర్‌లాల్ పేర్కొన్నారు. జైన మతస్తులు తర్వాత బౌద్ధ మతస్తులు ఆ తర్వాత శైవ మతస్తులు ఈ కొండను ఆశ్రయించి తమ మతాలను మరింత ప్రభావితం చేశారని చరిత్రకారులు చెబుతుంటారు. సంగమేశ్వర కొండ దిగువన గొల్లభామగా పిలువబడే స్త్రీ దేవతా విగ్రహం ఉంటుంది. 164 మెట్లు ఎక్కి పైకి వెళితే కొండ నట్టనడుమ భాగంలో 25 అడుగుల లోపలికి ఒక గుహ ఉంది. ఈ గుహలో ఆరు అడుగుల ఎత్తున్న పురుషాకృతి కలిగిన విగ్రహం, దానిముందు ఒక శివలింగం, నంది, దుర్గాదేవి, విఘ్నేశ్వర విగ్రహాలు ఉన్నాయి. ఏటా కార్తీక మాసం సోమవారాల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. కార్తీక సోమవారాల్లో ఆలయం వద్ద అభిషేకాలు, ప్రత్యేక పూజలతో సందడి వాతావరణం నెలకొననుంది.

జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు సమష్టిగా రాణిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లా వేదికగా ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్-14 బాలుర మల్టీడేస్(త్రీడేస్ మ్యాచ్‌లు) క్రికెట్ టోర్నమెంట్‌లె నవంబర్ 1న కృష్ణా జిల్లాతో జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. తొలుత టాస్ గెలిచిన కృష్ణా జిల్లా శ్రీకాకుళం బౌలర్ల ధాటికి 115 పరుగులకే కుప్పకూలింది. శ్రీకాకుళం జట్టులో శిమ్మ సాత్విక్ 3 వికెట్లతో విజృంభించగా, ఎల్.సాయిఆదిత్య, సీహెచ్ శ్రీయోజిత్ చెరో రెండు వికెట్లు , జె.హర్షవర్ధన్,ఎస్‌వీ ప్రేరణ్ తలా వికెట్ దక్కించుకున్నారు. అనంతరం బ్యాటింగ్ మొదలుపెట్టిన శ్రీకాకుళం జిల్లా తొలిరోజు ఆటముగిసే సమయానికి 34 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. జట్టులో నల్లా జోగేంద్ర 33 పరుగులతో, ఎస్‌వీఎస్ వివేక్‌నందా 20 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇంకా రెండు రోజులాట మిగిలి ఉండటంతో ఈ మ్యాచ్‌లోను విజయసాధించి పాయింట్ల పట్టికలో ముందు వరుసలో నిలుస్తామని జిల్లా జట్టు మేనేజ్‌మెంట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

కొత్త సీసాలో పాత సరుకే!

శ్రీకాకుళం క్రైమ్ : కొత్త మద్యం పాలసీలో భాగంగా నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందిస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలు ఇంకా కార్యరూపంలోకి రాకపోవడంతో సర్వత్రా చర్చ సాగుతోంది. జిల్లాకేంద్రం ఎచ్చెర్ల బాట్లింగ్ డిపో వద్ద గొడౌన్‌లలో ఇప్పటికే 20 వేల కేసుల (బాక్సులు) పాత స్టాకు ఉండటమే కాక రోజుకు ఐదారు వ్యానుల్లో అదనంగా పాత స్టాకే వస్తుండటం గమనార్హం. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తక్కువ ధరకే మద్యం అన్న మాట ప్రకారం చూసుకుంటే రూ. 99కే చీప్ లిక్కర్ బాటిళ్లు జిల్లాకు చాలా తక్కువగా వస్తున్నాయి. రోజుకు 500 నుంచి 800 కేసుల (బాక్సుల)వరకే వస్తున్నాయి. దీంతో జిల్లాలో ఉన్న 158 మద్యం షాపుల్లో కొన్నింటికే వీటి సరఫరా జరుగుతోంది.

మంత్రి పదవి రాకే 'కూన' వింత ప్రవర్తన

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవి ఆశించి భంగపడిన ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యుడు కూన రవికుమార్ వింతగా ప్రవర్తిస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడటం తగదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ మైకు దొరికితే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను తూలనాడటం తగదన్నారు. మీకు రాజకీయ భిక్ష పెట్టింది తమ్మినేని సీతారాం అనే విషయాన్ని మర్చిపోకూడదని హితవుపలికారు. వైఎస్ కుటుంబ తగాదాల గురించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే.. సొంత సోదరి ఆస్పత్రి విషయంలో ఎలా వ్యవహరించారో గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఇప్పటికైనా హుందాగా రాజకీయాలు చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేధింపులు తట్టుకోలేక పలువురు వ్యాపారులు పట్టణం విడిచి వెళ్లిపోయేందుకు సిద్ధపడుతున్నారని చెప్పారు. పిచ్చి తుగ్లక్ పరిపాలన చేస్తే కూన రవికుమార్‌ను నియోజకవర్గం నుంచి వెంటపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

రాష్ట్రపోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం శ్రీనివాస్, పీడీ వాసు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 హాకీ పోటీలకు శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులు సవర జయకృష్ణ, సవర చందు ఎంపికయ్యారు. వీరిద్దరు గిరిజన విద్యార్థులు కావడం విశేషం. వీరు నెల్లూరు వేదికగా ఈనెల 3 నుంచి 5 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. శుక్రవారం ఇక్కడి నుంచి బయలుదేరిన క్రీడాకారులతో పాటు పీడీ వాసును హెచ్ఎం డి.శ్రీనివాసరావు, ఐటీడీఏ సీతంపేట ఏడీ అన్నదొర శుక్రవారం అభినందించారు. రాష్ట్రపోటీల్లో మెరుగ్గా రాణించి జిల్లాకు పేరుతీసుకురావాలని, జాతీయ పోటీలకు ఎంపికకావాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన పైడమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిలక పైడమ్మ (60) అనే వృద్ధురాలి మృతి చెందింది. ఇంటి ముందు రోడ్డుపై నిల్చుని ఉండగా గ్రామం వైపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

'సాక్షి' సీనియర్ ఫొటో జర్నలిస్టుకు అవార్డు



ఉభయ తెలుగు రాష్ట్రాల ఫొటోగ్రాఫర్లకు నిర్వహించిన ఫొటో కాంటెస్ట్‌లో శ్రీకాకుళం 'సాక్షి' దినపత్రిక సీనియర్ ఫొటో జర్నలిస్టు కె.జయశంకర్ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ కె.మన్మధరావు చేతుల మీదుగా అవార్డు, గోల్డ్‌మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

రహదారులు రక్తసిక్తం

జిల్లా రహదారులు రక్తసిక్తమయ్యాయి. శుక్రవారం ఉదయం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 18 మంది గాయపడ్డారు. ఆటోలు ఢీకొన్న ఘటనలో విద్యార్థులు, బొలెరో బోల్తాపడిన సంఘటనలో కూలీలు ప్రమాదానికి గురయ్యారు. క్షతగాత్రులంతా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

రెండు ఆటోలు ఢీ

- 10వ తరగతి విద్యార్థులకు గాయాలు
- టెక్కలి ఆస్పత్రిలో ఏడుగురికి చికిత్స



బోల్తాపడిన ఆటోలను పరిశీలిస్తున్న ఏఎస్సై నరసింహారావు



టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

మెళియాపుట్టి/టెక్కలి రూరల్: రెండు ఆటోలు పరస్పరం ఢీకొట్టిన ఘటనలో మెళియాపుట్టి మండలం జలక లింగుపురం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, విద్యార్థులు తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. జలక లింగుపురం గ్రామానికి చెందిన ఏడుగురు టెన్త్ విద్యార్థులు మెళియాపుట్టి మండల కేంద్రంలోని ట్యూషన్ సెంటర్‌కు ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆటోలో బయలుదేరారు. మెళియాపుట్టి గ్యాస్ కార్యాలయం వద్దకు రాగానే చికెన్ వ్యర్థాలు తరలించే వేరొక ఆటో డ్రైవర్ విద్యార్థులవైపు చూస్తూ వెకిలిచేష్టలతో సమీపంలోకి వచ్చాడు. విద్యార్థులున్న ఆటో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ఆటోలు పరస్పరం ఢీకొని బోల్తాకొట్టాయి. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులు బాలకృష్ణ, హేమలత, పవన్‌సాయి, ధనుశ్రీ, విష్ణుప్రియ, నాగచైతన్యలను తొలుత మెళియాపుట్టికి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఈవో తిరుమల చైతన్య ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై నరసింహరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలీల వాహనం బోల్తా

- 11 మందికి గాయాలు
- కొర్లాం–బారువ రోడ్డులో ఘటన



బోల్తా పడిన వాహనం



బారువ సామజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

సోంపేట: మండలంలోని కొర్లాం సబ్‌స్టేషన్ సమీపంలో బారువ– కొర్లాం రహదారిలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచిలి మండలం పూర్ణశాసనాం గ్రామానికి చెందిన దినసరి కూలీలు బారువ మేజర్ పంచాయతీ దాసరిగూడెం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం బొలెరో వాహనంలో బయల్దేరారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో కొర్లాం సబ్‌స్టేషన్ సమీపంలో వాహనం టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కూలీలంతా కిందపడి గాయాలు కావడంతో వెంటనే బారువ సామాజిక ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ బాలకృష్ణ, దుర్యోధన ప్రథమ చికిత్స నిర్వహించారు. ఎం.గాయత్రి, ఎం.సున్నమ్మ, శకుంతల బెహరా, ఎం.దమయంతి, ఎం.రుక్మిణిలకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళం జెమ్స్‌కు తరలించారు. బబ్బి బెహరా, కైలాస్ బెహరా, ఎం.కేశమ్మ, తిలోత్తమ బెహరా, రాజేశ్వరి బెహరా, రాజు బెహరాలను టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కంచిలి ఎంపీపీ పైలదేవదాస్ రెడ్డి, శాసనాం సర్పంచ్ వేణు, సోంపేట మండల నాయకులు బుద్దాన శ్రీకృష్ణ సామాజిక ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బారువ ఏఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.